బ్రహ్మోత్సవాలకు ఎమ్మెల్సీకి ఆహ్వాన పత్రిక

ఎమ్మెల్సీకి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న నిర్వాహకులు

రామాయంపేట, జనవరి 15: రామాయంపేటలోని పద్మావతి గోదా సమేత వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డికి బుధవారం ఆహ్వాన పత్రిక అందజేశారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్సీ శేరి ఇంటికి వెళ్లి ఫిబ్రవరి రెండో వారంలో నిర్వహించనున్న వేంకటేశ్వర స్వామి పుష్కర వార్షికోత్సవాలను రావాలని కోరారు. పత్రికను అందజేసిన వారిలో చైర్మన్ తోట లక్ష్మీపతి, కొవ్వూరి లక్ష్మణ్, నవాత్ కిరణ్, కాసం సంతోష్, యాద నాగరాజు ఉన్నారు.

రిలే నిరాహార దీక్షలో విద్యార్థులు

రిలే దీక్షలో పాల్గొన్న విద్యార్థులు

నిజాంపేట, జనవరి 15: బీటీ రోడ్డు నిర్మాణానికి నిజాంపేట ప్రధాన రోడ్డుపై నస్కల్ గ్రామస్తులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం ఐదో రోజుకు చేరుకున్నాయి. ఈ మేరకు నగరం, నస్కల్, రాంపూర్, నందగోకుల్ గ్రామాలకు చెందిన విద్యార్థులు ఈ దీక్షలో పాల్గొన్నారు. రోడ్డు అధ్వానంగా ఉండటంతో బస్సు రావడం లేదని, చదువుల కోసం పట్టణాల్లోని కళాశాలలకు సకాలంలో వెళ్లాలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు అనిల్, బాబు, నవీన్, దయాకర్, రమేశ్, నస్కల్ గ్రామస్తులు సంజీవ్, దుర్గయ్య, లింగం, ఎల్లం తదితరులు ఉన్నారు.

చెరువు నీళ్లు తరలిస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న రైతులు

నిజాంపేట, జనవరి 15: నిజాంపేటలోని మల్క చెరువు నుంచి అక్రమంగా చెరువు నీళ్లను మళ్లిస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ సురేశ్‌కుమార్‌కు రైతులు బుధవారం వినతిపత్రం అందజేశారు. రైతులు మాట్లాడుతూ మల్క చెరువులో ఇప్పటికే సగానికి తక్కువగా నీరు ఉన్నదని, మోటర్‌తో తన వ్యవసాయ పొలానికి చెరువు నీళ్లు మళ్లించడంతో ఇబ్బందులు ఎదురవుతాయని వినతి పత్రంలో పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో కొమ్మాట బాగులు, బండారి నర్సింహులు, జాల నర్సింహులు, రాజేశ్, ఎల్లస్వామి ఉన్నారు.

పేరూరులో పండగ పూట నీటి కటకట

మురుగు కాల్వలోనే నీళ్లు పట్టుకుంటున్న ప్రజలు

మెదక్‌రూరల్, జనవరి 15: మండలంలోని పేరూరు గ్రామంలో నీళ్లు రాకపోవడంతో సమీపంలోని వ్యవసాయ బోర్లను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొన్నది. గ్రామంలో హ్యాండ్ బోర్లు, జట్ మోటర్లు లేక నీటి సమస్య ఏర్పడింది. మిషన్ భగీరథ నీళ్లు వచ్చినా కొందరు నల్లాకు మోటర్లు పెట్టడంతో అందరికీ సరిపడా నీరు రావడంలేదు. నీటి సమస్యను పరిష్కరించాలని కొన్ని నెలలు నుంచి అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోతున్నదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పతంగుల ధర విషయంలో గొడవ

- ఏడుగురిపై కేసు నమోదు

తూప్రాన్, జనవరి 15: పతంగుల ధర విషయంలో ఏర్పడిన గొడవ కారణంగా కొందరు యువకులు కత్తులు, కర్రలతో ఓ దుకాణం ఎదుట హల్‌చల్ చేసిన ఘటన తూప్రాన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. ఎస్సై శివానందం, షాపు యజమాని గణేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. తూప్రాన్‌కు చెందిన గణేశ్ పట్టణంలోని కేశవ నగర్ కాలనీలో కిరాణా దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. మంగళవారం కొందరు వ్యక్తులు కిరాణా దుకాణం దగ్గరకు పతంగులు కొనేందుకు వచ్చారు. పతంగుల ధర విషయంలో వారి మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో గణేశ్ అందులోని ఓ వ్యక్తిని పక్కకు నెట్టాడు. దీంతో ఆగ్రహించిన వ్యక్తులు ఆ షాపు ఎదుట కత్తులు తిప్పుతూ హల్‌చల్ చేశారు. పతంగులను చించివేశారు. కర్రలతో దాడికి యత్నించారు. ఈ విషయానికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పోలీసులు విచారణ చేపట్టారు. ఈ విషయంలో ఎస్ఐ శివానందం వివరణ కోరగా.. కిరాణా దుకాణంపై దాడికి యత్నించిన ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వారిని విచారిస్తున్నట్లు పేర్కొన్నారు.

చెట్టుకు ఢీకొన్న లారీ.. డ్రైవర్‌కు గాయాలు

చిన్నశంకరంపేట, జనవరి 15: ద్విచక్ర వాహనాన్ని తప్పించే క్రమంలో చెట్టును ఢీకొని లారీ డ్రైవర్‌కు గాయాలైన ఘటన చిన్నశంకరంపేట పట్టణ శివారులో బుధవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణ శివారులోని ఓ పరిశ్రమలో ముడి సరుకులు దింపి, చేగుంట వైపు లారీ వెళ్తున్నది. ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని తప్పించే క్రమంలో రోడ్డు పక్కన ఉన్న చెట్టును లారీ ఢీకొని రోడ్డు కిందకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ సల్మాన్‌కు గాయాలయ్యాయి. స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా ఘటనా స్థలాన్ని పరిశీలించి, డ్రైవర్‌ను దవాఖానకు తరలించారు.

రాష్ట్రస్థాయిలో రాణించడం అభినందనీయం

బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే, మాజీ సర్పంచ్ స్వరాజ్యలక్ష్మీశ్రీనివాస్‌గౌడ్



రాష్ట్రస్థాయిలో గెలుపొందిన శ్రామితను సన్మానిస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

- నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

శివ్వంపేట, జనవరి 15: మండలంలోని గోమారం గ్రామానికి చెందిన కుమ్మరి శ్రామిత రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన సైన్స్ ఫెయిర్‌లో రాణించడం అభినందనీయమని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం రాష్ట్ర స్థాయి సైన్స్‌ఫెయిర్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని శ్రామితకు ఘనంగా సన్మానించారు. తమ గ్రామం పేరు రాష్ట్రస్థాయిలో తీసుకురావడంపై ప్రశంసించారు.

పోటీల్లో పాల్గొనడం అభినందనీయం

సంక్రాంతి పండగకు మహిళలు ముగ్గుల పోటీల్లో పాల్గొనడం అభినందనీయమని ఎమ్మెల్యే అన్నారు. పండగను పురస్కరించుకుని మాజీ సర్పంచ్ స్వరాజ్యలక్ష్మీ శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఎమ్మెల్యే బహుమతులు అందజేశారు. మాజీ జడ్పీటీసీ పబ్బమహేశ్‌గుప్తా ముగ్గుల పోటీల్లో పాల్గొన్న 30 మంది మహిళలకు చీరలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రమణాగౌడ్, మాజీ ఎంపీటీసీ నువ్వుల దశరథ, నాయకులు హనుమంతురెడ్డి, యాదాగౌడ్, యాదయ్య, భిక్షపతిరెడ్డి, నర్సింహారెడ్డి, కుంట లక్ష్మణ్, శ్రీశైలంయాదవ్, రాకేశ్‌రెడ్డి, విజేతలు కావేటి నాగమణి, కావేటి రమాదేవి, కుమ్మరి శైలజ ఉన్నారు.

లబ్ధిదారులకే ప్రభుత్వ పథకాలు అందాలి

- సంక్షేమ పథకాలు అమలుకు అంకితభావంతో పనిచేయాలి
- కలెక్టర్ రాహుల్ రాజ్

హాజరైన అధికారులు

మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 15: లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు పారదర్శకంగా అందజేయాలని, అందుకు అధికారులు అంకితభావంతో పనిచేయాలని కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డుల విధివిధానాలపై అదనపు కలెక్టర్ నగేశ్, డీఆర్వో భుజంగరావు, జడ్పీ సీఈవో ఎల్లయ్య, మెదక్, తూప్రాన్ ఆర్డీవోలు రమాదేవి, జయచంద్రారెడ్డి, డీపీవో యాదయ్య, జిల్లా వ్యవసాయాధికారి వినయ్, తహసీల్దార్లు, ఎంపీవోలు, మండల ప్రత్యేకాధికారులతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలపై కలెక్టర్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పథకాల అమలును ఈనెల 26 నుంచి ప్రారంభించనున్న నేపథ్యంలో అధికారులు నిబద్ధతతో పనిచేయాలని ఆదేశించారు. ఈనెల 16 నుంచి 20వ తేదీ వరకు క్షేత్రస్థాయిలో సర్వేలు, ఈనెల 21 నుంచి 24వ తేదీ వరకు గ్రామ సభలు నిర్వహించి, ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. 5వ తేదీలోగా డేటా ఎంట్రీలో తప్పులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామసభల్లో వచ్చే పిర్యాదులు స్వీకరించాలని తెలిపారు.

పథకాలు అమలు ఇలా...

రైతు భరోసా పథకం ద్వారా వ్యవసాయ యోగ్యమైన భూములకు పెట్టుబడి సాయం కింది ఎకరాకు రూ.6 వేల చొప్పున రెండు విడతలుగా రూ.12వేలు, భూభారతి పోర్టల్‌లో నమోదైన వ్యవసాయ భూమికి మాత్రమే చెల్లిస్తుంది. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ద్వారా అర్హులైన వ్యవసాయ కూలీ కుటుంబానికి మాత్రమే రూ.6 వేల చొప్పున రెండు విడతలుగా రూ.12 వేలు అందిస్తారు. దారిద్ర్య రేఖకు దిగువ గల వారికి మాత్రమే కొత్త రేషన్‌కార్డులు వస్తాయి. దారిద్ర్య రేఖకు దిగువ గల వారికే ఇందిరమ్మ ఇండ్ల పథకం వర్తిస్తుంది. పథకాల అమలుకు క్లస్టర్ వారీగా డేటాను కంప్యూటర్‌లో ఎంట్రీ చేయాలని కలెక్టర్ సూచించారు.

సంబురంగా సంక్రాంతి

పెద్దశంకరంపేట: వేంకటేశ్వర ఆలయంలో నోములు నోచుకుంటున్న ఆర్యవైశ్య మహిళలు

రామాయంపేట: పట్టణంలో ఇండ్ల ముందర రంగురంగుల ముగ్గులు వేస్తున్న మహిళలు

మెదక్‌లో ముగ్గు వేస్తున్న గృహిణి

గాలి పటాన్ని ఎగురవేస్తున్న పద్మాదేవేందర్‌రెడ్డి

మెదక్ మున్సిపాలిటీ/ మెదక్‌రూరల్/ చిన్నశంకరంపేట/ పాపన్నపేట/ పెద్దశంకరంపేట/ రామాయంపేట/ వెల్దుర్తి/ చేగుంట/ చిలిపిచెడ్, జనవరి 15: ప్రజలు భోగి, మకర సంక్రాంతి, కనుమ పండుగను నిరాడంబరంగా జరుపుకొన్నారు. మహిళలు, యువతులు తమ ఇండ్ల ఎదుట పోటాపోటీగా తీరొక్క రంగులతో రంగవల్లులు వేశారు. ముగ్గుల మధ్య గొబ్బెమ్మలు, నవధాన్యాలు, చెరుకు గడలు, రేగు పండ్లు, జీడి పండ్లు పెట్టి పూజలు చేశారు. కొంతమంది పిడకలతో మంట పెట్టి కుండలో పాలు పొంగించారు. పిండి వంటలతో ఇండ్లన్నీ ఘుమఘుమలాడాయి. సాయంత్రం నువ్వులు, చక్కెర పంచుకుంటూ మహిళలు ఒకరికొకరు సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. బొమ్మల కొలువులు పెట్టి, సుమంగళి నోములు నోచుకుని ముత్తాయిదువులను పిలిచి వాయినాలిచ్చి వారి ఆశీర్వాదం తీసుకున్నారు. సంక్రాంతి పండగ వేడుకల్లో గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసుల కీర్తనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పెద్దశంకరంపేటలో మకర సంక్రమణ మహోత్సవాన్ని పురస్కరించుకుని టీటీడీ కల్యాణ మండపంలో ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో పంచ కల్యాణాలు, బృందావనం, గాజుల బండి నోములను సామూహికంగా నిర్వహించారు. జిల్లా యువకులు, చిన్నారులు భవనాలపై సాండ్ సిస్టం ఏర్పాటు చేసుకోని కేరింతలు కొడుతూ గాలిపటాలు ఎగురవేసి సందడి చేశారు. చిన్నాపెద్ద తారతమ్యం లేకుండా గాలిపటాలను ఎగురవేశారు. సంక్రాంతిని పురస్కరించుకుని మహిళలకు ముగ్గుల పోటీలు, యువకులకు క్రికెట్, వాలీబాల్ పోటీలు నిర్వహించారు.

- ఇండ్ల ఎదుట తీరొక్క రంగవల్లులతో కళకళలాడిన ముంగిళ్లు
- గాలి పటాలు ఎగుర వేసిన మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, యువకులు, చిన్నారులు
- కనులపండువగా కనుమ
- ఆకట్టుకున్న గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసుల కీర్తనలు

ఏడుపాయల దుర్గమ్మ సంబురాలు

సంక్రాంతి పురస్కరించుకుని ఏడుపాయల వనదుర్గమ్మను ప్రత్యేకంగా అలంకరించారు. దుర్గమ్మ ఎదుట గంగిరెద్దు, గాలిపటాలు, చెరుకు గడలు, హరిదాసు, భోగిమంటలు అలంకరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

గాలి పటాలు ఎగురవేసిన మాజీ ఎమ్మెల్యే

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి హైదరాబాద్‌లోని తన నివాసంలో బంధువులు, పార్టీ నాయకులతో కలిసి గాలిపటాలు ఎగురువేసి సంక్రాంతి ఉత్సవాలు జరుపుకొన్నారు.

చేగుంటలో ఇండ్ల ఎదుట ముగ్గులు వేస్తున్న యువతి, మహిళలు

చిన్నశంకరంపేట: గవ్వలపల్లిలో ముగ్గుల పోటీలో విజేతకు బహుమతి అందిస్తున్న ఏఎంసీ మాజీ చైర్మన్

మెదక్ రూరల్: మండలంలో పతాంగులు ఎగురవేస్తున్న చిన్నారులు. యువకులు

దేవులపల్లి రోడ్డు మరమ్మతులు చేయాలి

ఎంచె రోడ్డును పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి

పాపన్నపేట, జనవరి 15: కుర్తివాడ హనుమాన్ మం దిర్ నుంచి దేవునిపల్లి (ఎంచె) వరకు రోడ్డు మరమ్మతులు చేయాలని మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి కోరా రు. బుధవారం ఆయన రైతులతో కలిసి ఎంచె రోడ్డును పరిశీలించారు. 2005లో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పు డు రైతుల విజ్ఞప్తి మేరకు 900ఎకరాలకు ఉపయోగప డేలా రోడ్డు మంజూరు చేయించాన్నారు. ప్రస్తుతం ఆ రోడ్డు శిథిలావస్థకు చేరుకున్నదన్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని కోరారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

కౌడిపల్లి, జనవరి 15: సీఎంఆర్ఎఫ్ పేదలకు వరంలాంటిదని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సార రామాగౌడ్ అన్నారు. బుధవారం నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి సహకారంతో మంజూరైన చెక్కులను అందజేశారు. భూరుగడ్డకు చెందిన డింది లక్ష్మికి రూ.60వేలు, వెంకట్‌రావ్‌పేట్ మంగమ్మకు రూ.19,500, షేరితండా శాంతికి రూ.19వేలు, నర్సింలుకు రూ.22వేల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో కుతుబోద్దీన్, నర్సింలు, ఆంజనేయులు ఉన్నారు.

యజ్ఞశాలకు శిలాన్యాసం

శివ్వంపేట, జనవరి 15: శివ్వంపేటలోని బగలాముఖి శక్తిపీఠంలో అమ్మవారి ఉపాసకుడు శాస్త్రుల వెంకటేశ్వరశర్మ సొంత ఖర్చు రూ.30 లక్షలతో యజ్ఞశాల పనులకు బుధవారం శిలాన్యాసం చేశారు. అనంతరం దాతల సహకారంతో ఆలయం వద్ద సీసీరోడ్డు పనులు ప్రారంభించారు.

లైంగిక దాడి నిందితులకు రిమాండ్

నిందితుల వివరాలను వెల్లడిస్తున్న పోలీసులు

చేగుంట, జనవరి 15: మతిస్థిమితం లేని మహిళపై లైంగిక దాడికి పాల్పడిన ముగ్గురు నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు రామాయంపేట సీఐ వెంకట్‌రాజాగౌడ్ తెలిపారు. చేగుంట పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం నిందితుల వివరాలు వెల్లడించారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 8న మాసాయిపేట మండలం రామంతాపూర్‌కు చెందిన ఒక వ్యక్తి తన గేదె కనిపించడంలేదని ఫిర్యాదు చేశాడు. దీంతో హంస ఫ్యామిలీ రెస్టారెంట్‌లోని సీసీ కెమెరాల ఫుటేజ్‌లను పరిశీలించాం. అందులో రెస్టారెంట్ సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వెనుకాల మతిస్థిమితం లేని మహిళపై ముగ్గురు వ్యక్తులు లైంగిక దాడి చేసినట్లు రికార్డైంది. దీంతో ఈ దారుణం బయటపడింది. చేగుంట నుంచి కోళ్లను సప్లయి చేసే వాహన డ్రైవర్, హెల్పర్లు ఈ ఘాతుకానికి ఒడిగట్టినట్లు గుర్తించాం. నిందితులు తూప్రాన్‌కు చెందిన సయ్యద్ అఫ్రోజ్, చేగుంటకు చెందిన గౌర బస్వరాజ్, బీహార్ రాష్ట్రానికి చెందిన మహ్మద్ సాహిల్‌గా గుర్తించాం. వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. సమావేశంలో చేగుంట ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి, పోలీసు సిబ్బంది ఉన్నారు.

చాముండేశ్వరిని దర్శించుకున్న ఎస్పీ

అమ్మవారిని దర్శించుకున్న ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి దంపతులు

చిలిపిచెడ్, జనవరి 15: మండలంలోని చిట్కుల్ గ్రామ శివారులో గల మంజీరానది తీరాన వెలిసిన చాముండేశ్వరిని ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి దంపతులు దర్శించుకున్నారు. మంగళవారం ఉదయం అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చన కార్యక్రమాలను ప్రధాన అర్చకుడు ప్రభాకర్‌శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం అన్నదానంలో పాల్గొన్నారు.

హెల్మెట్ లేదా ఫెనాల్టీ కట్టాల్సిందే

వాహనాలు తనిఖీ చేస్తున్న రామాయంపేట పోలీసులు

రామాయంపేట, జనవరి 15: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకుంటే ఫెనాల్టీ కట్టాల్సిందేనని ఎస్సై బాలరాజు హెచ్చరించారు. బుధవారం రామాయంపేట శివారులోని గజ్వేల్ చౌరస్తా వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహించారు. వాహనదారులు కాగితాలు వెంట ఉంచుకోవాలన్నారు. ఆటోలు నడిపే వారు సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటే కేసులు నమోదు చేస్తామన్నారు.

రేపు తిరుమలనాథ స్వామి ఆలయంలో వేలం

నిజాంపేట, జనవరి15: చల్మెడ తిరుమలనాథ స్వామి ఆలయంలో స్వామి వారి బ్రహ్మోత్సవాలు (జాతర) ఫిబ్రవరి 2 నుంచి 5 వరకు జరుగనున్నాయి. ఈ మేరకు జాతరలో కొబ్బరికాయల విక్రయాలు, పూజా సామగ్రి దుకాణాల ఏర్పాటుకు వేలం పాటను ఈ నెల 17న నిర్వహించనున్నట్లు ఈవో రవికుమార్ ప్రకటనలో తెలిపారు.

కాముని గోనయ్య సేవలు ఆదర్శనీయం

శివ్వంపేట, జనవరి 15: దివంగత కాముని గోనయ్య సేవలు ఆదర్శనీయమని జిల్లా గ్రంథాలయ చైర్మన్ సుహాసినిరెడ్డి అన్నారు. మంగళవారం గోమారం గ్రామంలో జాతీయ మత్స్యకారుల సమాఖ్య రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కాముని గోనయ్య తృతీయ వర్ధంతి సందర్భంగా మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాస్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి నివాళులర్పించారు.

బాధిత కుటుంబానికి బాల్య స్నేహితుల సాయం

ఆర్థిక సాయం అందజేస్తున్న బాల్య స్నేహితులు

రామాయంపేట, జనవరి 15: మండలంలోని రాయిలాపూర్‌లో మూర్ఛతో మృతిచెందిన గజం చంద్రం(55) కుటుంబానికి మృతుడి చిన్ననాటి స్నేహితులు రూ.15 వేల ఆర్థిక సాయాన్ని బుధవారం అందజేశారు.

చేగుంటలో..

చేగుంట, జనవరి 15: చేగుంటకు చెందిన ఆడుపు రాజమణి మృతి చెందింది. బాధిత కుటుంబాన్ని వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పరంజ్యోతి పరామర్శించి, రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం

నిజాంపేట, జనవరి 15: మండలంలోని కల్వకుంటలో కంఠారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి జ్ఞాపకార్థం టెన్నీస్‌బాల్, క్రికెట్ టోర్నీ పోటీలను చంద్రారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ అందె కొండల్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. విజేతలకు రూ.20 వేల నగదు బహుమతి అందజేస్తామని వారు తెలిపారు.

యువతకు క్రికెట్ కిట్ అందజేత

చిలిపిచెడ్, జనవరి 15: మండలంలోని సోమక్కపేట గ్రామంలో యువతకు క్రికెట్ కిట్, సామగ్రిని మండల యువ నాయకుడు బెస్త దుర్గాచలం మంగళవారం అందజేశారు.

ఐదుగురు దొంగలు అరెస్టు

చిన్నశంకరంపేట, జనవరి 15: ఫ్యాక్టరీకి ఉపయోగించే సుమారు రూ.4లక్షల విలువ చేసే ఇనుప గేరు రాడ్లను దొంగలించిన ఘటన చిన్నశంకరంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని పట్టణ శివారులో ఉన్న ఓ పరిశ్రమలో జరిగింది. రామాయంపేట సీఐ వెంకటరాజాగౌడ్ తెలిపిన వివరాల ప్రకా రం.. హరీశ్ స్టీల్, ట్యూబ్స్ పరిశ్రమ భవన నిర్మాణ పనులు చేపడుతున్నారు. ఈ క్రమంలో పరిశ్రమ గదిలో ఉంచిన ఇనుప గేరురాడ్లను దుండగులు ఈ నెల 10న పరిశ్రమ ప్రహరీని కూల్చి ఎత్తుకెళ్లారు. బుధవారం ఈ ఇనుప గేరు రాడ్లను అమ్మడానికి తీసుకువెళ్లే సమయంలో ఎస్సై నారాయణగౌడ్ పట్టుకున్నారు. నిందితు ల్లో పట్టణానికి చెందిన రమేశ్, రామచంద్రం, సురేశ్, నాగరాజు, బాబు ఉన్నారు. వీరు దొంగలించిన ఇనుప గేరు రాడ్డును పట్టణానికి చెందిన లింగం వ్యవసాయ పొలం వద్ద దాచిపెట్టారు. తీసుకెళ్లున్న నిందితులను పట్టుకుని విచారించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఐదుగురు నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.